**International Journal of Academic Research**
P-ISSN: 2348-7666
Homepage: https://www.ijar.org.in/
Volume-12, Issue-1, Jan-Mar-2025
This work is licensed under a Creative Commons Attribution 4.0 International License [CC BY 4.0]

**Research Article**

# తెలుగు గేయంపై ఇతర గీతాల ప్రభావం

*డాక్టర్ లంకిపల్లె జ్యోతీశ్వరనాయుడు*
*తెలుగు అధ్యాపకులు,*
*విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,*
*వెంకటగిరి, తిరుపతి జిల్లా,*
*చరవాణి: 9290881346*

**ప్రవేశిక:**

గేయం అంటే గానయోగ్యమైనది. గేయానికి పాటకు పెద్దగా తేడాలు చెప్పలేము. గేయంలో మాత్రా ఛందస్సు ఉంటుంది. పద్యం కంటే ముందే గేయం జానపదుని నోటి వెంట వెలువడి ఉంటుంది. అయితే ఇది మౌఖిక రూపంలో ఉండుటవల్ల ప్రసిద్ధి చెందలేక పోయిందనవచ్చు. దాదాపు 8, 9 శతాబ్దాల పాటు మౌఖికంగా ఉన్నా, గురజాడ, కృష్ణశాస్త్రి వంటి వారి కృషి ఫలితంగా అది అక్షర రూపాన్ని సంతరించుకున్నది. ఆ తరువాత వందలాది గేయాలు వివిధ కవుల కలం నుంచి వెలువడ్డాయి. అయితే ప్రాచీన జానపదుల గేయాలకు నేటి గేయాలకు చాలా వ్యత్యాసం కనబడుతుంది. ఆంగ్ల 'రొమాంటిసిజమ్' ప్రభావం చేత తెలుగు సాహిత్యంలో భావ కవిత ఒక విలక్షణ కవితా ప్రక్రియగా బయటపడింది. ఆధునిక కాలంలో భావకవులు గేయాలు రాశారు. పద్యాలలోని నియమిత ఛందస్సు కాకుండా, స్వతంత్రత కలిగిన మాత్రా ఛందస్సు కలిగి యతిప్రాసలకు ప్రాధాన్యం లేకుండా ఉండడం అంత్యప్రాసల ఆడంబరం అన్నవి గేయ లక్షణాలు. ఈ గేయానికి ఇంత నిడివి ఉండాలని నియమం లేదు. కానీ జానపదుల నోటివెంట లక్షలాది గేయాలు అలవోకగా ఆశువుగా వెలువడ్డాయి.

**గీతాల ప్రభావం:**

ఈ గేయాలను పౌరాణికాలు, చారిత్రకాలు, మత సంబంధాలు, పారమార్థిక గేయాలు, స్త్రీల పాటలు, శ్రామిక గేయాలు, పిల్లల పాటలు, శృంగార గేయాలు, అద్భుత రస గేయాలు, కరుణరస గేయాలు, హాస్యపు పాటలు, భాషా సారస్వతాలు, సాంఘిక విషయాలు, జానపద గేయాలు మరియు సినిమా గేయాలుగా ప్రధానంగా వర్గీకరించవచ్చు. నేడు సినిమా గేయాలకు అన్ని వర్గాల ప్రజలు బలంగా ఆకర్షితులవుతున్నారు. సినీగేయాలలో ఆధ్యాత్మిక, సాంఘిక, శృంగార, పౌరాణిక గేయాలకు అధిక ప్రాధాన్యం ఉంది. విడుదలైన ప్రతిసినిమాలోనూ ఒక ఆకర్షణీయమైన పాట ఉంటుంది. అది చాలా నెలల పాటు ప్రజల నోళ్ళ వెంట అలవోకగా పాడబడుతుంటుంది. సోదాహరణంగా చెప్పాలంటే 'యమగోల' సినిమా విడుదలైన సందర్భంగా ఆ సినిమాలోని 'ఒలమ్మి తిక్క రేగిందా...' అనే పాటను చాలాకాలం ఆబాలగోపాలం అలవోకగా పాడుకుంటుండేవారు. 'భక్తతుకారాం' సినిమా విడుదలైనప్పుడు అందులోని 'బలే బలే అందాలు సృష్టించావు' అనే పాటను పాడుకునేవారు. 'సీతారామ కళ్యాణం' సినిమా విడుదలైనప్పుడు 'రాళ్ళల్లో ఇసకల్లో రాశాము ఇద్దరి పేర్లు' అనే పాటను పాడుకునేవారు. ఇలా అనేక సినిమా పాటలు పాడుకునేవారు. కొత్త సినిమా, కొత్త పాట రాగానే ముందు పాటను వదిలేసేవారు. ఈ కోవలో చూస్తే, ప్రజలు ఈ పాటలను ఏ ఒక్క హీరో హీరోయిన్‌కో పరిమితం చేయలేదు. వారికి పాటలు కూని రాగాలు తీసే విషయంలో ఎలాంటి వివక్ష ఉండేది కాదు. ఈ నేపథ్యంలో చూస్తే ఈ సినీ గేయాలపై జానపద శాస్త్రీయ, ప్రైవేటు గీతాల ప్రభావం విరివిగా

ఉందని చెప్పవచ్చు. ఈ ఆకర్షణీయమైన పాటలకు కొందరు పేరడీలు కట్టి పాడుతున్నారు.

**జానపద గేయాలు:**

జయరాజ్ అనే ఒక ప్రజాకవి 'వానమ్మ వానమ్మ ఒక్కసారి వచ్చిపోయే వానమ్మ' అనే పాట రాశాడు. ఈ పాట నేటి సమాజాన్ని ఉర్రూతలూపుతున్నది. అందులోని కొన్ని చరణాలు ఇలా ఉన్నాయి.

"వానమ్మ వానమ్మ ఒక్కసారన్నా వచ్చిపోయే వానమ్మ
తెలంగాణ పల్లెలన్నీ ఎండి మండుతున్నాయ్
తినడానికి తిండిలేక తాగడానికి నీళ్లులేక
............................................
............................................
చెరువుల్లో నీళ్ళులేవు బావుల్లో నీళ్ళులేవు
సెలకల్లో నీళ్ళులేవు చేలల్లో నీళ్ళులేవు
వేరుశెనగ ఎండిపోయే మొక్కజొన్న మాడిపోయే" – అంటూ సాగుతుంది.

ఈ తెలంగాణ ప్రాంత పాటను సినిమాల్లో మరో విధంగా చేర్చారు. ఈ గేయాన్ని అనుకరిస్తూ ఒక పాట ఇలా రాయబడింది. వర్షం చిత్రంలో ఆ పాట ఇలా ఉంది.

"సినుకు రవ్వలో సినుకు రవ్వలో
చిన్నదాని సంబరాన చిలిపి నవ్వులో
...................................
...................................
ఎన్నాళ్ళకు గుర్తొచ్చానే వాన
ఎన్నాళ్ళని దాక్కుంటావే పైన
...................................
...................................
నువ్వు వస్తానంటే నేనొద్దంటానా" – అని కవి రాశాడు.

మొదటి పాటలో ప్రజాకవి వర్షాన్ని ఆహ్వానిస్తాడు. ఆహ్వానించడానికి గల కారణాలను చెబుతాడు. రానందుకు ఏర్పడిన దుస్థితిని తెలిపాడు. అయితే సినీ కవి ఎలాంటి సామాజిక స్పృహ లేకుండా నువ్వు వస్తానంటే వద్దంటానా అంటాడు. వాళ్లకి అది అత్యవసరం. వీళ్ళకిది వినోదం.

ప్రజాకవి, ప్రజాయుద్ధనౌక గద్దర్ 'నన్నుగన్న తల్లులారా! తెలుగు తల్లి పల్లెలారా! పాటనై వస్తున్నానమ్మో! నా యమ్మలారా!' అంటూ పాట పాడాడు. ఈ పాటలో గద్దర్ తెలుగుదేశం గొప్పతనాన్ని పాటకున్న శక్తిని కళ్ళకు కట్టినట్లు తెలిపాడు. ఈ పాటను అనుసరిస్తూ, 'అవునన్నా కాదన్నా' చిత్రంలో కులశేఖర్ రచించిన పాట వెలువడిందనవచ్చు. ఆ పాట ఇలా ఉంది...

నేల తల్లి గుండెలో
నేల తల్లి గుండెలో

ఎన్ని వేల పాటలో ఎన్ని వేల పాటలో
పాటే వింటే ఊపే రావాలి రా!
తాళమేస్తే కోనసీమే కోయిలమ్మయి పాడాలిరా
చిందులేసి ఆడాలిరా!
ఊరి జ్జనం ఊగేలా నాదస్వరం ఊదాల
మద్దిల దరువెయ్యాలా తుళ్ళిపడేలా
పాటే వింటే ఊపే రావాలిరా!
కోయిలమ్మయి పాడాలిరా చిందులేసి ఆడలిరా!
ఈ పల్లె పదాలే నోరార అనాలి
తప్పెట్లే పడాలి రాగానికి
జాబిల్లి వినాలి నేలకదే దిగాలి
జజ్జనకిడి జనారే తాళానికి
వానమ్మ చిందేసి ఆడాలిరా!
............................
.............................
మూలనున్న అమ్మమ్మ
మూడు కాళ్ల ముసలమ్మ
పాటవిని రోజంతా చిందులెయ్యాలరా" – అంటూ రాశాడు.

గద్దర్ పాటలో పాట ద్వారా తాను ఏమి కోరుకుంటున్నాడో కవి చెప్పాడు సినీ పాటలో పాట ఎలా ఉండాలో చెబుతున్నాడు ఒకరిది ప్రజల దృక్పథం రెండో వారిది వ్యాపార దృక్పథం.

**ప్రైవేటు గీతాలు:**

ప్రైవేటు గీతాలు ఆకర్షణీయంగా ఉండేవాటిని సినీగీతాలుగా కొందరు మలుచుకుంటారు. దీనికి నిదర్శనంగా వంగపండు ప్రసాదరావు గారి సుప్రసిద్ధ చైతన్యగీతం 'ఏం పిల్లో ఎల్దమొస్తవ' అన్న ఈ గేయంలోని కొన్ని చరణాలు ఇలా ఉన్నాయి.

"ఏం పిల్లడో ఎల్దమొస్తవ ఏం పిల్లో ఎల్దామొస్తవా
శ్రీకాకుళంలో సీమ కొండకి
..............................
..............................
తెలంగాణ కొమురయ్య కొండకి ఎల్దమొస్తవా
పులుల్ని మింగిన గొర్రెలున్నయట
..................................
రాయలసీమ రాళ్ళకొండకి
తుపాకి పేల్చిన తూనీగలు ఉన్నాయట" –

అంటూ విప్లవ బాటలో ప్రజలను చైతన్య పరుస్తుంది. ఈ గేయం నాలుగు దశాబ్దాలుగా ఆంధ్ర దేశాన్ని ఉర్రూతలూపుతున్నది. దీనిని గుర్తించిన సినీకవి మొదటి చరణాన్ని ఒక పాటలో చేర్చాడు.

ఈ పాట చరణాన్ని 'మగధీర' చిత్రంలో యధాతథంగా వాడుకున్నారు. 'చెప్పనే చెప్పద్దు వంక' అనే పాటలో 'ఏంపిల్లో ఎల్దమొస్తవా' అనే చరణం ఉంది. ఒకే ఒక్క చరణం మాత్రమే వాడుకున్నారు. దీనిని బట్టి ఆ చరణానికి ఎంత ప్రాధాన్యం ఉందో తెలుస్తున్నది. హీరో హీరోయిన్లు ఈ చరణాన్ని పాడుతూ స్టెప్పులు వేస్తున్నప్పుడు వీక్షకులు ఆబాలగోపాలం కోరస్ ఇచ్చి చిందులు వేశారు.

**శాస్త్రీయ గీతాలు:**

ఈ దృక్కోణంలో చూసినప్పుడు శాస్త్రీయ పద్ధతిలో అనగా సంగీత కళ లక్షణాలకు అనుగుణంగా ఎందరో కవులు గేయాలు రాసుకున్నారు. వాటిని సినిమాల్లో వాడుకున్నారు. ఉదాహరణకు చెప్పాలంటే జయదేవుని అష్టపదులను కొన్ని సినిమాల్లో పాడుకున్నారు. 'ధీర సమీరే యమునా తీరే వసతి వనే వనమాలి' అనే శాస్త్రీయ గీతం, 'ధర్మచక్రం' సినిమాలో ఉపయోగించారు. అదేవిధంగా 'తెనాలి రామకృష్ణ' చిత్రంలో జయదేవుని అష్టపదుల్లోని 'చందనచర్చిత' అనే గీతం ఉపయోగించబడింది. ఆ గీతంలోని కొన్ని చరణాలు ఇలా ఉన్నాయి.

"చందన చర్చిత నీల కళేబర పీత వసన వనమాలి
కేళీ చలన్మణి కుండల మండిత గండ యుగస్మిత శాలీ
హరిరిహ ముగ్ధ వధూనికరీ విలాసిని విలసతి కేళీపరీ
పీనపయోధర భారభరేణ హరిం హరిరమ్య సరాగమ్॥
గోప వధూరను గాయతి కాచిదుదంచిత పంచమరాగమ్
..........................................................
..........................................................
దుస్మీలన్తి కుహూః కుహూరితి కలోత్తలాః పికానాంగిరః
రసోల్లాసభరేణ విభ్రమ భృతామా భీరవామభ్రువా" – అని ఉంది.

ఇలాంటి శాస్త్రీయ గీతాలను సినిమాలలో ఉపయోగించుకున్నారు.

**అనువాద గేయాలు–తెలుగుదనం:**

ఈ నేపథ్యంలో చూసినప్పుడు సంస్కృత, తమిళ, కన్నడ భాషల్లోని ఎన్నో గేయాలు తెలుగులోనికి అనువదించబడ్డాయి. వాటిల్లో ఎంతో తెలుగుదనం మనకు కనిపిస్తుంది. చరిత్రకు ఎక్కని ఎన్నో విషయాలు జానపదుల పాటల్లో కథల్లో ఒదిగి ఉన్నాయి. దీనికి నిదర్శనంగా తమిళనాడులోని తెలుగు జానపద కళారూపమైన 'సేవాటం'లో కొందరు కంబళ నాయకర్లు 12, 13 శతాబ్దాల్లో తెలుగువారు ఏ విధంగా వలస బాట పట్టారో గేయరూపంలో చెప్పారు. తమిళంలోని ఆ గేయాన్ని ఇలా అనువదించారు.

"ఉత్తర సీమలో దోర భూములు మబ్బు రాజ్జెము
పొలుగు బూములు అనుగొండ సీమ, పెనుగొండ రాజ్జెము ఒప్పుసీమ,
గొద్ద మర్రిమానుల కింది ఉండేటి అరిరాజులు, సూరిరాజులు

సామిరాజులు – సత్తెమతులు, బూమి రాజులు – బుద్ధిమతులు

మత్తెనుండేటి – మాట్ల మల్లేరు, రత్నాలు ఉండేటి రాజులు వచ్చినామయ్య

రాతి ఉండేటి రాజులు వచ్చినామయ్య...

యా ఈ...యా ఈ...యా ఈ...

గోమాత దేవతకు తలపితిమి

సూర్యదేవునికి తలపితిమి

మీ సీమలోను మచ్చిక ఎంత సంఖ్య

ఉత్తరమున ఉడుముగల

దక్షిణమున తల్లవార్లు కురుసు

చాలక మబ్బురిల్లి ముత్తేల వానలు కురుసు

జాముకు కురిసేది జవదేడి వానలు

కోదేతి కురిసేది కోడె వానలు

తెల్లవారి కురిసేది తెల్లవానలు

నెలకు మూదువాన్లు వచ్చినాది వానవర్సము

మాసీమలోన పంటలు చాలయ్య కొంచెదాపండి పంచేనయ్యా

ఒడ్లు పండేను, సాము పండేను సామగా, జొన్నలు పండేను జోరుగా

......................................

......................................

మా సీమలోన ఆకుతోట అనకనవద్దు

సెరుకు తోట సేనెల్ల కద్దు

మానుమట్టం నస్సింగా ఉంది

మంచి గోవులయ్య" – అని ఉంది.

ఆ రోజుల్లో ఎందరో తెలుగువారు కర్ణాటక నుంచి తమిళనాడుకు వలస వెళ్లారని తెలుస్తున్నది. కంబళం వారు తాము ఎట్లా తుంగభద్రాతీరం నుండి వలస వచ్చామనే విషయాన్ని పై విధంగా పదంకట్టి పాడుకున్నారు. ఈ పాట ద్వారా వాళ్ళు ఏ కొండకోనలు దాటి ఏవిధంగా తమిళనాడుకి వలసబాట పట్టారో తెలుస్తుంది. ఇది చాలా సుదీర్ఘమైన గేయం.

పై పాటలు తెలుగుదేశంలోని ఎన్నో ఊర్లపేర్లు ప్రస్తావించబడ్డాయి. దోరభూములు అంటే 'దొరభూములు'. పొలుగుభూములు అంటే 'పులుగునాడు భూములు' అనగా 'రాజంపేట, అనకొండసీమ అనగా అనగొంది (కర్ణాటక). పెనుగొండ రాజ్యం అనగా నేటి అనంతపురం జిల్లాలోని పెనుగొండ గెండికోట అనగా నేటి 'గండికోట'. 'ఒప్పుసీమ' అంటే నేటి కడప, కర్నూలు సరిహద్దులోగల అవుకు సీమ. ఎర్రసీమ అనగా 'ఎర్రమల కొండలు'. ములికినాడు అనగా ఇప్పటి కడప జిల్లాను అప్పుడు 'మురికినాడు'గా పిలిచేవారు. ముద్దబాటు అనగా నేటి 'ముద్దనూరు'. వేపయాట్టు, మామిడి, గోరండ వనములు అనగా వేప, మామిడి, గోరింటాకుచెట్లు. జామురుబండ్లు అనగా నేడు తాడిపత్రి ముద్దనూరు మధ్యలో ఉన్న ప్రాంతం.

కమలాల గుండ్లు అనగా 'కమలాపురం'. అవ్వలకొండ అనగా చిత్తూరు – పలమనేరు మధ్యప్రాంతం. గువ్వలమర్రి అనగా నేటి 'గువ్వలచెరువు'. ఇలా అనువాద గేయంలో తెలుగుదేశంలోని ఊర్లపేర్లు, వృక్షాలపేర్లు, పంటలపేర్లు వంటివి అనేక అంశాలు చెప్పబడ్డాయి.

ఇలా గేయం వినోద సాధనంగా చారిత్రక నిధిగా ప్రజాజీవన తాత్వికతకు హేతువుగా ఇంకా పరిపరి విధాలుగా విరాజిల్లుతున్నది. శాస్త్రీయ జానపద అనువాద విప్లవ దృక్పథాలన్నిటిని తనలో ఇముడ్చుకొని ముందుతరాలకు సాంస్కృతిక వారధిగా దోహదపడుతున్నది.

**ఆధార గ్రంథాలు**

1. తెలుగు జానపద గేయకవిత్వం – బిరుదురాజు రామరాజు
2. వంగపండు ప్రసాదరావు పాటలు
3. గురజాడ గేయకవిత్వం

**Citation:** Lankipalle Jyoteeswaranaidu 2025. "Telugu Geyamu Pai Etara Geetalu Prabhaavamu". International Journal of Academic Research, 12(1): 41-46.
**Copyright:** ©2025 Lankipalle Jyoteeswaranaidu. This is an open-access article distributed under the terms of the Creative Commons Attribution License (https://creativecommons.org/licenses/by/4.0/), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author and source are credited.